క్లుప్తంగా

కాపాడు తల్లీ... విజయదుర్గమ్మ..



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు నిర్వహించారు. రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు.

వైద్య విద్యను వ్యాపారం చేయడం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో వైద్య విద్యను వ్యాపారం చేయడం తగదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల్లేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చే విధంగా తీసుకువచ్చిన జీవో 107, 108 వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు వంశీయాదవ్, మహబూబ్ బాష తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి ఔట్ సోర్సింగ్ కార్మికులకు న్యాయపరమైన డిమాండ్లతో వేతనాలను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నేడు రాయలసీమ పర్యాటకంపై ఉపన్యాసం

కడప కల్చరల్ : రాయలసీమ పర్యాటక ప్రదేశాలపై బుధవారం ఉదయం 9.30 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఉపన్యాసం ఏర్పాటు చేశామని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందులో ప్రధాన వక్తగా వివేక్ లంకమల హాజరవుతారని, ఆయన లంకమల్లేశ్వర అభయారణ్యం విశేషాల గురించి ఉపన్యసిస్తారని వివరించారు. ఈ కార్యక్రమానికి వైవీయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా, రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య విశిష్ట అతిథిగా, జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎస్.మల్లికార్జునరావు గౌరవ అతిథిగా పాల్గొంటారన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని మానవ హక్కుల సంఘం కార్యాలయంలో మంగళవారం ప్రజా ఉద్యమ గేయకారుడు గద్దర్‌కు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మానవ హక్కుల న్యాయవాది షేక్ ఆమీన్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి పౌరుడిని తన ఉద్యమపాటలతో చైతన్య పరిచిన గద్దర్ మరణం ప్రజా కళాకారులకు జానపద కళాకారులకు తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ఆయన మరణం కళారంగానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్‌కరీం సేవా సమితి అధ్యక్షులు రాయల్ కరీముల్లా, బాషా, శ్రీను, అమదుల్లా, సమీర్ పాల్గొన్నారు.

మానవత సేవా సంస్థకు వాహనం వితరణ

చెన్నూరు : వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి తన తల్లి గుమ్మ సుబ్బమ్మ జ్ఞాపకార్థం ప్రజల అవసరార్థం మానవత సేవా సంస్థకు మంగళవారం టాటా ఏసీ వాహనాన్ని ఉచితంగా ఇచ్చారని ఉప్పరపల్లె ఎంపీటీసీ ఎర్రసాని నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చెన్నూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా మండలంలో ఎక్కడైనా బాడీ ఫ్రీజర్ అవసరమైనట్లయితే అక్కడికి తీసుకెళ్లడానికి ఉపయోగపడుతుందన్నారు. మానవత సేవా సంస్థ, మండల ప్రజలు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు.

ద్విచక్రవాహనాలు సీజ్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలో శబ్ద కాలుష్యాన్ని కలిగిస్తున్న వాహనాలపై మంగళవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు ట్రాఫిక్ సీఐ యుగంధర్ తెలిపారు. కంపెనీ ఫిట్టెడ్ సైలెన్సర్‌ను మార్చి నిషిద్ధ సైలెన్సర్లను బిగించి నడుపుతున్న ద్విచక్రవాహనాలను సీజ్ చేసి యజమానులకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ భారీ శబ్దాలను చేస్తున్న వాహనాల వల్ల గుండె జబ్బులు కలిగిన వారు, వయస్సు మీద పడిన వృద్ధులు భయపడుతున్న పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు.

‘పీఎం స్వనిధి’తో చిరు వ్యాపారులకు చేయూత



సీవోలు, సీఎల్ఆర్‌పీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : ‘ప్రధానమంత్రి స్వనిధి’ పథకం ద్వారా చిరు వ్యాపారులకు చేయూతనివ్వాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నగరంలో వీధి విక్రయదారులకు మరికొన్ని జోన్లు ఏర్పాటు చేసి, వ్యాపారాలు చేసుకొనేందుకు వీలు కల్పిస్తామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అరికట్టాలని సూచించారు. మెప్మా పీడీ వై. సురేష్ రెడ్డి మాట్లాడుతూ వీధి విక్రయదారులు తీసుకున్న రుణాలతో సక్రమంగా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. వ్యాపారాలు వృద్ధి అయిన తర్వాత మరింత రుణం తీసుకోవాలన్నారు. వీధి వ్యాపారుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్‌డీఎం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వీధి వ్యాపారస్తులకు ఆర్థికంగా ఆదుకునేందుకు బ్యాంకు వారు సహాయ సహకారాలు అందించాలన్నారు. డిజిటల్ పేమెంట్ ద్వారా లావాదేవీలు నిర్వహించుకోవాలన్నారు. అనంతరం రుణాల చెల్లింపులో నిబద్ధత పాటించి, అధిక రుణాలకు అర్హత సాధించిన లబ్ధిదారులకు, ఎక్కువ రుణాలు మంజూరు చేసిన బ్యాంకు సిబ్బందిని కమిషనర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జీవనోపాధుల అధికారి నాగరాజు, సిటీ మేనేజర్ హరిప్రసాద్‌రెడ్డి, సీఓలు, సీఎల్ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఘనంగా మేయర్ ముందస్తు జన్మదిన వేడుకలు



డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప మేయర్ కె. సురేష్‌బాబు ముందస్తు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, హరూన్ గ్రూప్ సంస్థల ఎండీ అహ్మద్‌బాషాలు ఆయనచే కేక్ కట్ చేయించి, పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, తోటక్రిష్ణ, మియ్యా, ఉమైర్ పాల్గొన్నారు.

■ కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్‌చంద్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్లు చెన్నయ్య, ఎం. సుబ్బారెడ్డి, కె. బాబు, రామలక్ష్మణ్‌రెడ్డి, షఫీ, కె. సూర్యనారాయణరావు, బంగారు నాగయ్య, శ్రీరంజన్‌రెడ్డి, బండిప్రసాద్, మదన్, జమాల్‌వలీ, బాలక్రిష్టారెడ్డి, కె. రాజశేఖర్‌రెడ్డి, సమరనాథరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, త్యాగరాజు, సుబ్బారెడ్డి, జహీర్, కమాల్‌బాషా, లక్ష్మయ్య, పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, నారాయణమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘లయన్స్’ ఆధ్వర్యంలో పోటీలు

కడప కల్చరల్ : భారత స్వాతంత్య్ర దినోత్సవం ముందస్తు కార్యక్రమాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో యువతకు పలు పోటీలను నిర్వహిస్తున్నామని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ సంస్థ (ఇంటాక్) జిల్లా ఛాప్టర్ కన్వీనర్ చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోతుల వెంకట్రామిరెడ్డి, కొండూరు జనార్దన్‌రాజు తెలిపారు. సంస్థ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులకు వివరాలు తెలిపారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం ఉదయం 10.00 గంటలకు కళాశాల విద్యార్థులకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తామని, అనంతరం స్వాతంత్య్ర ఉద్యమంలో జిల్లా వాసుల పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీ ఉంటుందన్నారు. గురువారం ఉదయం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వాతంత్య్ర ఉద్యమంలో మహిళల పాత్ర అంశంపై వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. శుక్రవారం నాగరాజుపేటలోని మున్సిపల్ హైస్కూలులో స్వాతంత్య్ర దినోత్సవం గురించి విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ వెంటనే బహుమతి ప్రదానం ఉంటుందన్నారు.

పార్ట్‌టైం స్వీపర్ల వేతనం రూ.6 వేలకు పెంపు

- కుక్కలకు కు.ని ఆపరేషన్లు చేసేందుకు నిర్ణయం
- బాలాజీ కాంప్లెక్స్‌లో 25 షాపు రూములకు ఏడాది పాటు లీజు పెంపు
- స్టాండింగ్ కమిటీ సమావేశం తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలోని మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న 55 మంది పార్ట్‌టైం స్వీపర్లకు ఇచ్చే వేతనాన్ని రూ.4వేల నుంచి రూ.6వేలకు పెంచాలని నగరపాలక స్టాండింగ్ కమిటీ నిర్ణయించింది. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని, సంగీతంలో మెలకువలు పెంపొందించేందుకు 5 మంది సంగీత కళాకారులకు నెలకు రూ.12వేల చొప్పున జీతం చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. నగరంలో కుక్కల బెడదను నివారించేందుకు వీధి కుక్కల జనన నివారణ (కుటుంబ నియంత్రణ) ఆపరేషన్లు చేయుటకు తిరుపతికి చెందిన అనిమల్ కేర్ ల్యాండ్ సంస్థ ముందుకొచ్చింది. ఒక కుక్క పట్టడానికి రూ.1300తో దాఖలు చేసిన కొటేషన్‌ను ఆమోదించి వారికి వర్క్ ఆర్డర్ ఇవ్వాలని నిర్ణయించారు. తడిచెత్తలోంచి పొడిచెత్తను వేరు పరుచుటకు 16 మంది సిబ్బందిని రోజుకు రూ.400 కూలీతో నియమించుకునేందుకు అంగీకారం తెలిపారు. సెంట్రల్ జైలు సమీపంలోని హిందూ, క్రిష్టియన్, ముస్లిం శ్మశాన వాటికల్లో గుంతలు పూడ్చి, భూమి చదును చేయుటకు రూ.94.85లక్షలతో మట్టితోలాలని నిర్ణయించారు. సుందరీకరణలో భాగంగా కేసీ కెనాల్ రోడ్ విస్తరణ పనుల్లో రూ.43 లక్షలతో కొత్త విద్యుత్ దీపాలు అమర్చేందుకు ఆమోదం తెలిపారు. కడప నగరపాలక సంస్థకు చెందిన బాలాజీ కాంప్లెక్స్‌లో ఉన్న 23 షాపు రూములకు 33.33 శాతం పెంపుదలతో ఒక ఏడాది కాలపరిమితి పొడిగించాలని తీర్మానించారు. అప్సర థియేటర్ నుంచి చిన్నచౌకు పోలీస్‌స్టేషన్ వరకూ బీటీ రోడ్డు, సెంట్రల్ మీడియన్, గ్రీనరీ పెంచుటకు రూ.1.03 కోట్లు వెచ్చించేందుకు నిర్ణయించారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రవీణ్‌చంద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎం. సుబ్బారెడ్డి, షఫీ, శిరీష, మేసా ప్రమీలరాణి, హేమలత, అధికారులు పాల్గొన్నారు.

ద్వారకా నగర్ పార్కును అభివృద్ధి చేయాలి



రోడ్డుకు కొలతలు వేయడాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరం ద్వారకా నగర్‌లో ఉన్న పార్కును అభివృద్ధి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 19, 21వ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ద్వారకా నగర్ పార్కులో ఓపెన్ జిమ్, ఫౌంటేన్, గ్రీనరీ, వాల్ పెయింటింగ్ చేయించాలన్నారు. పార్కులో మొక్కలు నాటి మరింత అందంగా తీర్చిదిద్దాలన్నారు. చిన్నారుల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. రైతు బజార్‌లోని నగరపాలక సంస్థ స్థలంలో లైబ్రరీ, పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రైతు బజార్ పక్కనున్న ఆక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సంధ్యా సర్కిల్ నుంచి ఎర్రముక్కపల్లె సర్కిల్ వరకూ ఏర్పాటు చేసిన పోలార్స్‌కు రేడియం స్టిక్కర్లు అతికించాలన్నారు. పీఎఫ్ ఆఫీసు వరకూ రోడ్డు విస్తరణ చేయాలని ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 19, 21వ డివిజన్ల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు లక్ష్మయ్య, సుబ్బరాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

11 నుంచి సయ్యద్ సర్దార్ బాబా గంధోత్సవం

కలసపాడు : మండలంలోని శంఖవరం గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ సర్దార్ బాబా ఉరఫ్ బుర్హానుద్దీన్ చిష్తి స్వామి వారి గంధ మహోత్సవం ఈ నెల 11, 12, 13 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా ముజావర్ పి.ఓబయ్య (ఖాజామొయినుద్దీన్) తెలిపారు. ఇందులో భాగంగా 11వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు ఫకీర్ జరబులతో, ఖసీదాఖాని (మిలాద్)తో స్వామి వారి గది నుంచి గంధం దర్గాకు బయలుదేరుతుందన్నారు. రాత్రి 7 గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 12వ తేదీన రాత్రి దీపాలంకరణ జరుగుతుందని, 13వ తేదీ ఉదయం 10 గంటలకు తహలీల్ ఫాతేహా జరుగుతుందని తెలిపారు. ఈ గంధ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

11న మెగా జాబ్ మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఉన్న శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజిలో ఆగస్టు 11న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ అర్కటవేముల హరినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. టెక్ మహేంద్ర, జియో, ముత్తూట్ ఫిన్‌కార్ప్, అమెజాన్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, మెడ్‌ప్లస్, బ్లూ ఓషన్, ఫినో పేమెంట్ బ్యాంకు, మహేంద్ర హోం ఫైనాన్స్ ఇలా దేశ వ్యాప్తంగా ఉన్న 30 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని ఆయన వివరించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, విద్యార్హత లేని వారు కూడా పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. వివరాలకు 63012 25355కు సంప్రదించాలన్నారు.

హోండా డియో 125 సీసీ మార్కెట్‌లోకి విడుదల



వాహనాన్ని డెలివరీ ఇస్తున్న సేల్స్ ఏరియా ఇన్‌చార్జి రమేష్, షోరూం ఎండీ ఐశ్వర్య

కడప కార్పొరేషన్ : హోండా మోటారు వాహనాల కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన హోండా డియో 125సీసీ వాహనం కడప మార్కెట్‌లోకి విడుదలైంది. మంగళవారం స్థానిక చిన్నచౌకులోని అమోఘా హోండా షోరూంలో సేల్స్ ఏరియా ఇన్‌చార్జి రమేష్ చేతుల మీదుగా ఆవిష్కరించి, మొదటి వాహనం కొనుగోలు చే సిన వినియోగదారునికి తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా షోరూం మేనేజింగ్ డైరెక్టర్ సుంకర ఐశ్వర్య మాట్లాడుతూ ఏసీజీ, పీజీఎం, ఎఫ్ఐ సిస్టమ్‌తో ఈ వాహనం సైలెంట్ స్టార్ట్ అవుతుందన్నారు. స్మార్ట్ కీ, సైడ్ స్టాండ్ కట్ ఆఫ్, ఐడెలింగ్ స్టాప్ సిస్టమ్, ఇంటెలిజెంట్ మీటర్ వంటి అత్యాధునిక ఫీచర్లను కలిగి ఉందన్నారు. యువతకే గాక అన్ని వర్గాల ప్రజలకు నచ్చేలా దీన్ని తయారు చేశారన్నారు. లాంచింగ్ చేసిన మొదటి రోజే 4 వాహనాలను డెలివరీ ఇచ్చామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో షోరూం జనరల్ మేనేజర్ సి. మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఆర్ పాలసీ కల నెరవేరింది



మల్లెల ఝాన్సీరాణిని సన్మానిస్తున్న ఎంప్లాయిస్ అసోసియేషన్ యూనియన్ నాయకులు

కడప అగ్రికల్చర్: ప్రాథమిక వ్యవసాయ సహకారం (పీఏసీఎస్) ఉద్యోగుల హెచ్ఆర్ పాలసీ కల నెరవేరిందని ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీ రెడ్డిబాబు అన్నారు. ఇందుకు సహకరించి ఉద్యోగుల కలను నెరవేర్చిన ఆప్‌కాబ్, డీసీసీబీ చైర్పర్సన్ మల్లెల ఝాన్సీరాణి రుణం తీర్చుకోలేనిదని అన్నారు. ఇందకుగాను ఆమెను మంగళవారం కడప డీసీసీ బ్యాంకులో ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా తరుపున నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఆర్ పాలసీ ప్రకారం వేతనాలు చెల్లించాలని ఉద్యోగుల డిమాండ్ మేరకు ఆగష్టు 1వ తేదీ నుంచి జీతాలను డీఎల్ఈసీ కమిటీ ద్వారా ఆమోదించి హెచ్ఆర్‌పాలసీ ద్వారా జీతాలు అందించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఇది తొలి విజయంగా భావిస్తూ ఉద్యోగులంతా ఆనందంగా ఉన్నారన్నారు. ఈ విషయంలో ఆప్‌కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, డీసీసీబీ సీఈఓ రాజేంద్రకుమార్, బ్యాంకు సలహాదారు సహదేవరెడ్డి, డీసీఓ గురుప్రకాష్, డీఎల్‌సీఓ గోపీకృష్ణ, డీసీఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌డిఎల్‌సీవో వరప్రసాద్‌నాయుడు, అధికారులకు కృతజ్ఞతలను తెలియచేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు జాఫర్, సాబ్జాన్, అంజనేయులు, అన్సర్, వీరశేఖర్‌రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ‘చిల్డ్రన్ ఫర్ చిల్డ్రన్’



‘చిల్డ్రన్ ఫర్ చిల్డ్రన్’ కార్యక్రమంలో పాల్గొన్నవారు

కడప కల్చరల్ : కడప నగరంలో మంగళవారం ఆర్వీ విజయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ‘చిల్డ్రన్ ఫర్ చిల్డ్రన్’ కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. ఫౌండేషన్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పీవీ సంధ్య మనవడు, పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థి రాచమడుగు అభిరామ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి దాదాపు 60 మందికి పైగా తల్లిదండ్రులు, విద్యార్థులు హాజరయ్యారు. అభిరామ్ మాట్లాడుతూ కరోనా సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పడుతున్న బాధలను చూశానని, తనవంతుగా ఏదైనా చేయాలనిపించి చిల్డ్రన్ ఫర్ చిల్డ్రన్ కార్యక్రమానికి రూపకల్పన చేసి అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతిభ కలిగి ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువుకు దూరమయ్యే ప్రమాదానికి చేరిన 388 మంది పాఠశాల విద్యార్థులకు, 488 మంది కళాశాలల విద్యార్థులకు ఆర్థికసాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రభు, సునీల్ రాచమడుగు, ప్రోగామ్ కో ఆర్డినేటర్ శంకరమ్మ పాల్గొన్నారు.

ఉర్దూ ఆచార్యుల పోస్టులకు సహకరించాలి



రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సెక్రటరీకి వినతి పత్రం ఇస్తున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్ : వైవీయూ ఉర్దూ విభాగానికి ఆచార్యుల పోస్టుల మంజూరుకు కృషి చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి సెక్రటరీ నజీర్ అహ్మద్‌ను రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ వసీవుల్లా బక్తియార్, రూట రాష్ట్ర సమన్వయకర్త మహమ్మద్ అయ్యూబ్ కోరారు. ఈ విషయమై మంగళవారం ఆయనను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా కేవలం కన్సల్టెంట్ ద్వారా ఉర్దూ విభాగం కొనసాగిస్తున్నారని అన్నారు. దీంతో ఉర్దూ విద్యార్థుల రీసెర్చ్ వర్కుకు, ఉర్దూ పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి ఆచార్యుల పోస్టులు మంజూరు చేసి ఉర్దూ మీడియం విద్యార్థుల ఉన్నత చదువులకు సహకరించాలని వారు కోరారు.

ప్రజల సమస్యలన్నీ పరిష్కరించాం



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని లేటపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అప్పటికప్పుడే పరిష్కరించారు. రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, డ్రైనేజ్, విద్యుత్ స్తంభాలు, మంచినీటి పైప్‌లైన్ తదితరవి కావాలని ప్రజల నుంచి వినతులు అందటంతో వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏ కుటుంబానికి ఎంత మేరకు లబ్ధిచేకూరిందో వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వం ప్రజల వద్దకు వెళ్లలేదన్నారు. కానీ జగనన్న సీఎం అయ్యాక నిత్యం ప్రజల్లోనే ప్రజాప్రతినిధులు, అధికారులు ఉండేలా ఏ పార్టీ నిర్వహించలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ప్రజల మధ్య తిరిగిన సందర్భాలు లేవన్నారు. అంతకుమునుపు వైఎస్సార్ రాష్ట్ర నాయకుడు వల్లూరు వంశీనాథ్‌రెడ్డి (వీవీఆర్) ఘన స్వాగతం పులుకుతూ క్రేన్ సాయంతో గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, దేవిరెడ్డి ఆదిత్యారెడ్డి, స్థానిక నాయకులు మల్లికార్జునరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, హిదాయత్, కొండారెడ్డి, గండి భాస్కర్, నిఖిల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రసాద్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, విజయేంద్రారెడ్డి, పుత్తా మధు, రమణ, మర్రి సుబ్బన్న, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

పులివెందుల రూరల్ : ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బాలరాజు, దస్తగిరి, ప్రధాన కార్యదర్శి శ్రీహరిరావు, జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమ సమగ్ర సర్వే యాత్ర-2లో భాగంగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సమావేశాన్ని నిర్వహించి వారు మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ ద్వారా భవన నిర్మాణ అదర్ కన్‌స్ట్రక్షన్స్ సంక్షేమ బోర్డు నుండి కార్మికులకు సంక్షేమ పథకాలు గత మూడేళ్లుగా నిలిపివేశారన్నారు. సంక్షేమ బోర్డులో గుర్తింపు పొందిన కార్మికులకు సంక్షేమ పథకాలను మళ్లీ అందించాలన్నారు.

డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలి

వల్లూరు : జాతీయ నులి పురుగుల నివారణా కార్యక్రమంలో భాగంగా ఈనెల 10వ తేదీన జరగనున్న డీ వార్మింగ్ డేను విజయవతం చేయాలని ఎంపీడీఓ జుబేద తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణా కార్యక్రమంపై ఆమె మండలంలోని వైద్య, విద్యా శాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. నులి పురుగుల నివారణా మాత్రల వలన పిల్లల ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చునన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఆల్బెండజోల్ మాత్రలను మండలంలోని 19 సంవత్సరాల లోపు వయసు వున్న పిల్లలు, కిషోర బాలలకు తప్పనిసరిగా వేయాలన్నారు. వైద్యాధికారి ఫణీంద్ర మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ఇంటి వద్ద వున్న పిల్లలను సైతం గుర్తించి మాత్రను వేయడానికి కృషి చేయాలన్నారు. అనంతరం జాతీయ నులి పురుగుల నివారణా కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో - 2 విజయ్‌రెడ్డి, సీహెచ్‌వో వేణుగోపాల్, వైద్య, విద్యా శాఖల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శరవేగంగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు



పులివెందులలో వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలు

పులివెందుల రూరల్ : పట్టణ శివార్లలోని కె.వెలమవారిపల్లె సమీపంలో నిర్మిస్తున్న వైఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాంత ప్రజల ఆశయ సాధనలో భాగంగా మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నారు. సుమారు రూ.500 కోట్ల వ్యయంతో మెడికల్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. మరో ఆరు నెలల్లో మెడికల్ కళాశాల భవనాల సముదాయం పూర్తవుతాయి. మెడికల్ కళాశాల నిర్మాణ పనులను జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే ఉన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే ఆసుపత్రితోపాటు కళాశాల కూడా ప్రారంభమవుతుంది. ఈ ప్రాంత ప్రజల కల నెరవేరినట్లు అవుతుంది. 100 సీట్లతో ఎక్కడాలేని విధగా పులివెందులలో వైఎస్సార్ మెడికల్ కళాశాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ డిసెంబర్ నాటికి మెయిన్ బ్లాక్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.